
# సర్టిఫికెట్




ఆ పిల్లవాడు అడుగుమీద అడుగ్గా... దారిని అడుగులతో కొలుస్తున్నట్టుగా నడుస్తున్నాడు.

వయస్సుకు మించినబరువు తలపైకెత్తి ఎవ్వరో ముందుకు మెడపట్టి నెట్టుతున్నట్లుకాదు.

ముక్కుతాడు పట్టి ముందుకు తాగినా ముంపని గొడ్డుమాదిర పట్టుబలవంతాన అతడా ఆవరణ దాటాడు.

ఆ ఆవరణ ముందరొక బాట ఉంది. ఆ బాట నల్లగా ఉంది చీకటిని పట్టి నిగ్గదీసినట్లుగా!

చీకటి బతుకుల్లో రోకటిపోట్ల గాయాల మాదిర ఆ రోడ్డంతా గుంతలు గుంతలుగా... రెండు దినాలుగా ముసిరిన ముసురులో ఆ గుంతల్లో నిలిచిన నీళ్ళు చీకటి బతుకులు కార్చిన కన్నీళ్ళుగా... ఆ కన్నీళ్ళను నిర్దాక్షిణ్యంగా వెదజల్లుతున్న కలిగిన వాళ్ళ కార్లు స్కూటర్లు ఆ బాట మీదుగా-

ఆ బాలుడు ఆ బాట పక్కన నిలబడ్డాడు.

ఆ బాట ముందర ఒక పాఠశాల!... అది ఉన్నత పాఠశాల!!

తాను చదువుకొనింది ఆ పాఠశాల్లోనే.

ఆ పాఠశాల ఆవరణలో మానుమల్లె చెట్లు... ఆ విజ్ఞానవాటికలో తావు దొరకడం తమ జన్మమే ధన్యమైనట్లుగా నిక్కినిక్కి నింగివైపు చూస్తున్నాయి. ఒకప్పుడు ఆ ఆవరణలో విశాలమైన ఖాళీస్థలం... ఆ ఖాళీ స్థలమంతా అందమైన తోట...

ఆ తోటలో ఎవరికిష్టమైన చోట వాళ్ళు కూర్చొని హాయిగా చదువుకోవడానికి అనువుగా ఉండేది. ఇప్పుడాఖాళీస్థలంలో తోటకు బదులుగా తలాతోకాలేనట్లుగా భవనాల్ని ఇరికించి ఇరికింది కట్టాయి ఇరుకు మనస్తత్వాలు.

ఆ నల్లటి తారురోడ్డు పక్కన నిలబడి ఆ పిల్లవాడు అదే ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తూ ఆ పాఠశాలవైపు తదేకంగా చూస్తున్నాడు. అడుగుమీద అడుగ్గా అతడు దాటి వచ్చిన ఆవరణలో కోర్ట్ బిల్డింగ్స్ ఉన్నాయి. ఆ కోర్టు బిల్డింగ్స్‌ను ఉన్నత పాఠశాలను వేరుచేస్తూ ఉన్న నల్లటి తారురోడ్డు జ్ఞానానికి అజ్ఞానానికి మధ్య గీచిన గీత మాదిర ఉంది. ఆ గీత మీద నిలబడిన అతని మనస్సు జ్ఞానానికి అజ్ఞానానికీ మధ్య కొట్టుమిట్టాడుతూ ఉంది.

ఆ పిల్లవాని పేరు నరసింహం.

నరసింహం నరులలో సింహమూకాదు. సింహాల్లో నరుడూ కాదు. అతడు ఒక సాదాసీదా విద్యార్థి. ఆ విద్యార్థి రెండు సర్టిఫికెట్ల కోసరం వారంరోజులుగా ఉత్తర దక్షిణ ధృవాల్ని కలిపినంత యాతన పడ్తున్నాడు.

ఒకటి కులానికి సంబంధించింది.

ఇంకొకటి స్వస్థలానికి సంబంధించింది.

"అవును బాబూ! నువ్విక్కడ చేరినపుడే నీ కులాన్ని స్వస్థలాన్ని నమోదుచేశారు కదా? మళ్ళీ ఈ ధృవపత్రాలు... ధృవాల్ని కలిపే యత్నాలు ఎందుకయ్యా?" అని ఎదురుగా ఉన్న ఉన్నత పాఠశాల నిలదీసి అడుగుతున్నట్లుంది.

తన సందేహమూ అదే!

"ఎంత మంచి సందేహం కలిగింది బాబూ నీకు?" అని అభినందిస్తున్నట్లుగా మానుమల్లెచెట్టు నాలుగు పువ్వులు రాల్చింది. ఆ చెట్ల మీద కూర్చున్న రామచిలుకలు 'బాబ్బాబూ! ఈ దేశంలో.. ఈ వయస్సులో ఇటువంటి సందేహాలన్నీ రాకూడదు బాబూ! చెప్పిన మాట వినడం...చెప్పింది చేయడం మంచి బాలుర లక్షణం. తెలిస్తే ఆ ప్రకారం నడుచుకో! లేకుంటే నేర్చుకో! అంతేకానీ 'ఎందుకు? ఎలా?' అని అడగడం ఎదిరించినట్లవుతుంది. ఎదిరించడంలో ఉన్న ఇబ్బంది నీకేంతెల్సు? మా మాదిర ఎత్తులో ఉండేవాళ్ళనడుగు చెప్తారు??" అని హెచ్చరించినట్లుగా రాగాలు తీస్తున్నాయి.

పాపం! నరసింహం ఆ నల్లటి తారురోడ్డు మీద నిలబడి నిట్టూరుస్తున్నాడు. అది సటపటమైన నిట్టూర్పు కాదు. భావితరాల వారసుడి నిట్టూర్పు. ఆ నిట్టూర్పు సెగల పొగల్ని ఆ పక్కపక్కనే

కొలువుదీరి కునికిపాట్లు పడుతున్న అగ్నిమాపక దళం గుర్తించకుండా పోవడం వాళ్ళతప్పుగాదు. 'అసలే నీళ్ళులేని రాయలసీమలో ఇటువంటి వ్యర్థ ప్రయత్నాల జోలికిపోతే మా పైవాళ్ళ సెగల పొగల్ని ఏం చెయ్యమంటారో చెప్పండి?' అని న్యాయాన్ని మనల్నే అడుగుతారు– కోర్టు పక్కన్నే ఉంటే కూడా! వాళ్ళపరంగా ఆలోచిస్తే ఆ మాట కూడా కాదనడానికి లేదు.

ఆ బాట మీద నడుస్తున్న జనం నరసింహం కంటపడలేదు. పాఠశాల్లోకి పరుగులు తీస్తున్న విద్యార్థులు కనిపించలేదు. నాజూకులు పోతున్న నల్లకోట్లు అసలే కనిపించలేదు. అతని మనస్సు రెక్కలు విప్పుకొని ఆ రెండు సర్టిఫికెట్ల చుట్టూ ఎగురుతూ ఉంది. వాటిని సాధించడం ఎలా? అని సతమతమవుతూ ఉంది.

అక్కడ నిలబడలేదు.

పోనీ! పోదామంటే ఎక్కడికి పోవాలో తోచడం లేదు. పోవలసిన చోట్లకంతా పోయాడు. చూడవలసిన వాళ్ళనందరినీ చూశాడు. వినవలసినదంతా విన్నాడు. ఇప్పుడిక ఏం చేయాలో తోచకుండా నిలబడుకొన్నాడు.

మనిషి నిలబడుకొన్నా మనసు? అది నేలమీద పడిన పాదరసం.

"ఈ బడిలోనే చదివాను. జిల్లా కంతటికి ఫస్ట్ వచ్చాను. కళాశాలకా? కళ తెచ్చాను. మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలో మంచి రాంక్ సాధించాను. అప్పుడెప్పుడూ ఇంత కష్టమనిపించలేదు. ఇప్పుడీ గండం గడిచేదెలా?" అని తన తెలివినంతా ఉపయోగించి ఆలోచిస్తున్నాడు నరసింహం.

మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలో మంచి రాంక్ వచ్చిందని తెలిసినప్పుడు నరసింహం ఎంత ఆనందపడ్డాడో ఇప్పుడంత విచారిస్తున్నాడు.

ఈ రెండు సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి ఇంత అవస్థ పడవలసి వస్తుందని నరసింహం కలలో గూడా అనుకోలేదు. "ఏముంది? తన కులాన్ని స్వస్థలాన్ని ధృవపరిచే బాధ్యత మండలాధికారిది. తన పని తాను చేస్తాడు' అనుకొని వెళ్ళి అడిగితే "సరాసరి నా దగ్గరికొచ్చి అడిగితే నేనేం చేస్తానయ్యా? నీది ఫలానా ఊరు... ఫలానా కులం... ఆ కులంలో ఫలనా తెగ... అని నీ ముఖం మీదేమైనా రాసి పెట్టుందా? దాన్ని చూసి అలానే రాసిచ్చేదానికి? వెళ్ళవయ్యా వెళ్ళు. విలేజ్ అసిస్టెంటు దగ్గరికి వెళ్ళు. అతడిచ్చే సర్టిఫికెట్లు తీసుకొని రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ని కలువు. ఆ తర్వాత వచ్చి నన్ను చూడు" అని పైనబడి కరిచినట్లుగా అరిచాడు.

ఆమాత్రం తెలుసుకోకుండా పోవడం తన తప్పే కదా? అని నరసింహం తన్ను తాను నిందించుకుంటూ విలేజ్ అసిస్టెంటు కోసరం బయలుదేరాడు.

వి.యం.లు, కె.యం.లు తమ తమ సేవల్లో తరించారని ఈ ప్రభుత్వం గుర్తించిన తర్వాత ఆ పదవులు విలేజ్ అసిస్టెంట్ల పరమయ్యాయి.

ఈ ఊళ్ళో ఇంత జనాభా ఉంది. కానీ సదరు అసిస్టెంట్ ఎలా ఉంటాడో? ఎక్కడుంటాడో? ఒక్కరికీ తెలియదంటున్నారు. కానీ దయదలచి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వారి కార్యాలయానికి

మాత్రం దారి చూపారు. అక్కడికి పోయాడు. వారి ముందు నోరు తెరిస్తే చాలు. 'నువ్వొక రాడికల్‌వి' అని నోరు మూయిస్తున్నారు. నోరు తెరిస్తే ఆయన కాదు ఆయన పక్కనున్న వాళ్ళే బుర్రరామకీర్తన పాడించేటట్టుంది. "ఆ రామకీర్తన పాడించుకోలేను. నా పనికి వాయిదా వెయ్యలేను. ఇంటర్‌వ్యూ దగ్గర పడ్తున్నది. మహా ప్రభో? ఈ పరిస్థితుల్లో నన్నేం చెయ్యమంటారో మీరే చెప్పండి!" అని అడిగేస్తే?-

నరసింహానికి అంతకంటే మంచి మార్గం కనిపించలేదు కాబట్టి వక్తృత్వపోటీకి తయారవుతున్న విద్యార్థి మాదిరి తన అభిప్రాయ వ్యక్తీకరణకు వాక్య వాక్యాన్ని నమిలినమిలి నెమరేసుకొంటూ బయలుదేరాడు.

ఆ రోడ్డు మీద కొంతదూరం పడమరగా నడిచి కుడివైపుకు తిరిగి ఉత్తరంగా ఆ సందుకు పట్టి నడిస్తే రాజమార్గం. అసలే రద్దీగా ఉండే ఆ రాజమార్గంలో వందలాది సైకిళ్ళు తుళ్ళుతూ తూలుతూ ఆవేశంతో అరుస్తూ ఆర్భాటాలు చేస్తూ వస్తున్నాయి.

ఎదురు నడవలేని అర్భకుడు నరసింహం. పక్కకు తొలిగి రోడ్డు పక్కన నిలబడుకొన్నాడు. నిలబడి చూస్తున్నాడు.

గొంతులు చినుగుతున్నాయి. దిక్కులు దద్దరిల్లుతున్నాయి. 'జిందాబాద్! జిందాబాద్!' నినాదాలు మారుమోగుతున్నాయి. న్యాయస్థానాలు నశించాలి. న్యాయనిర్ణేతల అక్రమాల్ని అరికట్టాలి. వాళ్ళ తీర్పులకు ఎదురు తిరగాలి.' అని ఒకడు మొదలుపెట్టే వేలాది గొంతులు అందుకొంటున్నాయి. వాళ్ళధాటికి తట్టుకోలేకుండా బజార్లో అంగళ్ళు మూతలుపడ్తున్నాయి. ఆడవాళ్ళు సందుగొందుల్లో పడి పరుగులు తీస్తున్నారు.

కామెర్ల రోగం తన అసలు స్వరూపాన్ని ఆవిష్కరించినట్టు... వెంకటేశ్వరుడు పద్మావతీ దేవితో వసంతాలాడితే ఆ పసుపు నీళ్ళతో ఊరు మునిగిపోతున్నట్లు రాజమార్గం రంగు మారింది.

నరసింహం చూస్తూ ఉండబట్టలేకుండా 'ఏంవిటిదంటా!' అని పక్కనున్న వ్యక్తిని అడిగాడు.

"ఉస్!... నోరు మూసుకో!" అన్నాడా వ్యక్తి భయాన్ని మొగం నిండా పులుముకొని.

నరసింహం నిజంగానే నోరు మూసుకొన్నాడు.

ఊరేగింపు ముందుకు సాగిపోయింది.

అప్పుడు గుండెల నిండా గాలి పీల్చుకొని "ఒరే అబ్బాయ్! నువ్వడిగిందేంది? ఇప్పుడడుగు చెప్తాను" అన్నాడు పక్కన నిలబడుకొన్న పెద్దమనిషి.

నరసింహం అడిగాడు.

"వీళ్ళ పార్టీ నాయకుడికి కోర్టు వ్యతిరేకంగా తీర్పు చెప్పిందట. ఆయన పిలుపు ఇచ్చాడు. కోర్టుల కెదురు తిరగమన్నాడు. వీళ్ళిల్లా తిరగబడ్డారు. ఈ మాట వాళ్ళ చెవుల్లో పడుంటేనా! పులుసులోకి మనఎముక ఒక్కటి మిగిలేది కాదనుకో!"

నరసింహం రెండు చేతులెత్తి నమస్కరించాడు.

నువ్వు నమస్కరించేది ఎవరికి బాబూ? నాకా? ఇంతమంది అభిమానానికి నోచుకొన్న ఆ నాయకుడికా? లేకుంటే వీళ్ళు ప్రదర్శిస్తున్న నాయక భక్తికా?"

ఆయన అడగలేదు. కానీ నరసింహం మాత్రం "న్యాయమేదో? అన్యాయమేదో? నిర్ణయించేది కోర్టు. ఎవ్వరో ఒక వ్యక్తి మీద వ్యతిరేకంగా తీర్పు చెప్పినంత మాత్రాన అందరు కోర్టులకు ఎదురు తిరగాల్సిందేనా? శివసేనలు శీనయ్యసేనలు భజనసంఘాలు ఏర్పడాల్సిందేనా? అప్పుడు న్యాయాన్యాయాల గతేం కావాలి? అయినా ఈ లోకంలో న్యాయం ఎక్కడేడ్చింది? న్యాయమే రాజ్యమేలుతూ ఉంటే నేనీ రెండు సర్టిఫికెట్ల కోసరం ఇన్ని తిప్పలు పడాలా?"

నరసింహాన్ని ఒక్క క్షణం ఆవేశం ఆవరించింది. అంతలోనే-

"నేనెంత? నా వయస్సెంత? ఏ వయస్సుకా పని అన్నారు గదా? ఈ వయస్సులో నేనేం చెయ్యాలి! చదువుకోవాలి. డాక్టర్ని కావాలి. నాకాళ్ళమీద నేను స్వేచ్ఛగా నిలబడాలి. అప్పుడు ఆశయాలు... ఆవేశాలు..."

ఈ ఆలోచనతో నరసింహం చెంపలు వాయించుకోలేదు కానీ అంతపని అయినట్లుగానే అడుగు ముందుకు వేశాడు.

మండల కార్యాలయాన్ని చేరుకొన్నాడు.

దేశంలో ఉన్న పసుప్పొడినంతా తెచ్చి ఆ కార్యాలయంలో ఒక గుట్టగా పోస్తే అందులో కూరుకపోయిన మనిషి గాలి పీల్చుకోలేకుండా ఉక్కిరిబిక్కిరవుతున్నట్లుగా మండలాధికారి గింజుకొంటున్నాడు.

ఆ సందులో నరసింహం.

ఎవ్వరో చొక్కాబట్టి వెనక్కు లాగితే తిరిగి చూశాడు.

ఎదురుగా ఆఫీసు జవాన్!

"గంపడు తంగేడు పూలకుప్పలో ఒక్క తుమ్మిపువ్వు మాదిర నువ్వెవర్రా?" అని విసుక్కొన్నాడు జవాన్.

నరసింహం చాలా వినయంగా తన కథనంతా చెప్పాడు. ఆ జవాను చాలా ఓపిగ్గా శ్రద్ధగా విన్నాడు. నరసింహానికి కొంచెం కొంచెం ధైర్యం కలుగుతూ ఉంది. అంతలోనే ఆ జవాన్ పకపక నవ్వాడు. ఆ నవ్వులో ఎంత నిర్లక్ష్యమో?

నరసింహం దేబె మొగం వేసి చూస్తున్నాడు.

"ఒరే అబ్బోడా? నిన్ను సూస్తా ఉంటే నాకు 'అయ్యో'మనిపిస్తా ఉండాది. ఈ పసుపు సొక్కాయిల కత నీకు తెల్దు. రేత్రికిరేత్రే పచ్చకార్డు కోసరం పసుపుసొక్కాయి ఏసుకొనొచ్చినానని ఒకడంటావుంటే ఇంకొకడంటాడు కర్ణుడు కవచకుండలాల్తో పుట్నెట్టు వాడు పసుపు గుడ్డల్తోనే పుట్నాడంట. దొటుగా ఉంటే పురుదుబోసిన మారెమ్మ నడగమంటా ఉండాడు. ఇవన్నీ ఉండాయే గెడ్డివావుల కాడ కుక్కలు. వీటికతంతా సెప్పినా నీకు తలకెక్కదు. ఈ పసుపుసొక్కాయిల్జెప్పినట్లు

మా ఆఫీసర్ ఇనక పొయ్‌నాడో గోయిందో గోయింద! ఈ ఊరికి ఆయనకు నీళ్ళు సెల్లిపోతాయి. నువ్విట్టా ఇంటికి ఆఫీసుకు, ఆఫీసుకుఇంటికి వారం దినాలు వర్సబెట్టి తిరిగినా దమ్మిడీలాబం ఉండదు. ఈ జాతరిట్టా జరగతానే ఉంటింది. కాబట్టి నిన్నిక్కడ పలకరించే నాదుడే ఉండదు. పలకరించే వాళ్ళుండంగానే ఈడ జరిగే పన్లు అడికాడికుండాయ్. లేనప్పుడు దీన్ని గురించి ఆలోసించాల్సిన పనేలే! కాబట్టి ఇంకీ ఆశ వదులుకో!"

నరసింహం మొగాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

"ఒరే! ఒరే! అట్లా నీళ్ళు గారిపోతే ఎట్లరా? ఇక్కడాశ వదులుకోమన్నానేకానీ అసలాశ వదులుకోమన్లేదే?"

నరసింహం మొగం కొంచెం నెత్తురు చుక్కేసుకొనింది.

"ఇప్పుడు నువ్వేం జేస్తావంటే నేరుగా కోర్టుకాడికి పో! ఆడ సబ్-జడ్జిని సూడు. సూడమంటే కొంపదీసి ఈడ దూర్నెట్టు ఆడగూడా దూరేసేవ్. అక్కడ నా మాదిరొక బిళ్ళజవానుంటాడు. వాణ్ణి పట్టుకో. ఆడగానీ నీ సర్టిఫికెట్లు సంపాదించుకుణ్ణావంటే వాటికింక తిరుగుమరుగు ఉండదు. ఈ సర్టిఫికెట్ల కంటే అవ్వి తూకంగూడా శానా జాస్తి. తెల్సిందా?" అని గీతోపదేశం చేశాడు కృష్ణభగవానుడి మాదిర.

వెంటనే నరసింహం గాండీవం చేతబట్టిన అర్జునుడు కాలేదుగానీ ఆ ఆశకూడా కుక్కాశగుండ్రాత్తో తీరినట్టు తీరిపోతే సరిపోతుందని కోర్టుకు దారితీశాడు.

ఈ పరిస్థితికి చేయి కలిసినట్లుగా సూర్యుడు కూడా కాసంత మెత్తబడి పసుపుపొడిని చేటలకెత్తి లోకం మీద కుమ్మరిస్తున్నాడు.

ఎండ తీవ్రత చాలా మట్టుకు తగ్గుముఖం పట్టింది.

ఉదయాన ఎప్పుడో తినిన మూడు ఇడ్లీలు. నరసింహం కడుపులో ఎలుకలు లోడుతున్నాయి. ఆ పరిస్థితిలో కూడా నరసింహానికి నవ్వు వచ్చింది– చదువుకొనే రోజులు మనసులో మెదిలి. అప్పుడైతే ఇంటర్‌వెల్ గంట కొడుతూనే "ఒంటికి గంట! కడుపులో మంట!" అని ఎగిరేవాడు. ఇప్పుడు కడుపేగాదు– నిజంగా గుండెలు కూడా మండుతున్నాయి. అయినా కార్యం మీద కన్నుపడ్తే?– కాళ్ళు కోర్టు ఆవరణలోనికి లాక్కొని పోయాయి.

ఆ ఆవరణలో కోర్టులన్నీ ఖాళీగా ఉన్నాయి.

హడావిడిగా అియిటు తిరుగుతున్న వాళ్ళు పిలిచినా పలికే స్థితిలో లేరు. ఇక వకీళ్ళను చూస్తే వాళ్ళందరు ఒక హాల్లో కూర్చొని వాదులాటలో మునిగి తేలుతున్నారు. ఏమి చేయాలో తోచకుండా ఆ ఆవరణలో కాలుగాలిన పిల్లిలా కాసేపు అటు యిటు తిరిగాడు. అప్పుడు మండల కార్యాలయంలో జవాను చెప్పిన మాట మనసులో మెదిలింది. "ఇంక బిళ్ళ జవానే దిక్కు!" అనుకొన్నాడు.

'దేవుడే దిక్కు' అనుకొనే వాళ్ళకు ఆ దేవుడు కనిపిస్తున్నాడో? లేదో? కానీ సబ్– కోర్టులో నిలబడి నరసింహం బిళ్ళ జవానే దిక్కనుకొనేసరికి మల్లెపువ్వు వంటి తెల్లని వస్త్రాలు

తొడిగినవాడు... సుంగులు విడిచి తలపాగా చుట్టినవాడు... పసుపు అంచులు కుట్టిన ఆకుపచ్చని దవాలా ధరించినవాడు... ఉరమున తళతళల తెల్లని బిళ్ళ మెరయువాడు– బిళ్ళ జవానుడు సాక్షాత్కరించాడు.

అతడు దేవుడు. నరసింహం భక్తుడు. ఆ దేవుని ముందు ఈ భక్తుడు తన దీనగాధనంతా వినిపించి 'నీవే తప్ప నితః పరంబెరుగ!' అన్నట్లుగా రెండు చేతులు పట్టుకొన్నాడు.

ఇటువంటి సందర్భాల్లో మన దేవుళ్ళు మాత్రం అవుటాఫ్ ది వే కూడా పోయ్ తన్ను మాలిన ధర్మాలు కూడా చేసిన సంఘటనలకు కొదువ లేదు కానీ– కోర్టులో జవానా? ప్రత్యక్షం కావడంతో దేవుడితో పోటీపడినా ప్రసన్నం కావడంలో అంత సులభంగా అయితే అది కోర్టు ఎలా అవుతుంది? అతడా కోర్టులో బిళ్ళ జవాను ఎలా అవతాడు? అయినా తాను ధరించిన శ్రీకృష్ణదేవరాయల స్టయిల్ తలపాగా ప్రభావమన్నట్లుగా... ఆ రాయలు పాలించిన సీమలో దేనికి కరువైనా ఉపన్యాసాలకు కరువు లేదన్నట్లుగా–

"అబ్బోడా! వొచ్చిచ్చి ఈ పొద్దనంగా వొచ్చినావే? వర్సగా మూడుదినాలు తలట్టా వంచకుండా వింటా ఉండాడొక కేసు. దాన్తోనే తలపగిలి పోతావుంటే పుండు మింద కారం జల్లినట్టుగా పసుపు సొక్కాయిలోళ్ళొచ్చి– రాఁవ! రాఁవ! వాళ్ళు కూసిన కూతలు నా నోట్తో అంటే తిన్నయింటికే వాసా లెంచినట్టవుతుంది. వాళ్ళట్లా పొయ్నారు. నువ్విట్టా వస్తావుండావ్. అయ్యగారిప్పుడు చేంబర్స్‌లో మొకం కడుక్కుంటా ఉంటాడు. ఇప్పుడుగానా మనంబోతే ఆ కేసులో పడే శిక్ష... నాకో... నీకో..."

నరసింహం నవ్వాలి. ఏడ్చాడు!

"ఒరే పిచ్చోడా! ఎప్పుడూ నెత్తురు మొకం సూడనోడు ఎప్పుడో ఒకసారి నెత్తర్జూస్తే అదిరిపడ్తాడు. దినవూ గొంతులు తెగేసేవాడికది నీళ్ళు జూసినట్టే గదా! ఈ దవాలా తగిలించుకోని నేనీడ సూస్తా ఉండేదిట్లా ఏడుపు మొకాల్నేగదా? ఏదో శిక్ష పడిపొయ్నట్టు సీదిసీది పారేస్తా ఉండావ్. దినఁవూ చచ్చేవాళ్ళ కేడ్సే వాళ్ళెవురూ లేరు గానీ అద్దో ఆడ కనపడ్తావుండాదే అది మేస్ట్రీటు కోర్టు. ఆడ మేస్ట్రీటుగా ఉండేదొక ఆడకూతురు. కన్నీళ్ళు పాడు పన్జేస్తే ఆణ్ణే పన్జెయ్యాలి. ఆడికి పొయ్ సూడు!" అని తన దోవన తాను పోయాడు.

నరసింహం మేజిస్ట్రేట్ కోర్టు దగ్గరికి వెళ్ళాడు.

ఆడమనిషి అయిన ఆ మేజిస్ట్రేట్ అక్కడ లంచ్ అవర్‌లో కూడా లంజరికం చేసిన ఆడవాళ్ళను విచారిస్తూ ఉంది.

న్యాయపీఠం మీద కూర్చొని ఆమె మండిపడుతూ ఉంది.

బోనులో నిలబడిన నలుగురు ఆడవాళ్ళు అదొక మాదిరిగా నవ్వుతున్నారు.

"తల్లీ! కంటికావరంతో కాదు. ఒళ్ళు కొవ్వెక్కీ కాదు. కడుపు కూటి కోసరం మా బతుకులిట్లా ఏడ్చినాయి. కడుపుకు కూడు కావాలంటే ఇంకేం మార్గాలు లేవా? అని మీరేగాదు– చాలామంది

అడగతారు. బదులు చెప్తే మీరు బదులు పలకలేనన్ని కథలు మా గుండెల్లో మూలుగుతున్నాయి. అదంతా ఎందుకు కానీ పాలిపోయిన మా బుగ్గల్ని చూడు... ఎండిన రొమ్ముల్ని చూడు.. డైటింగ్ చేసి కాదు డైటే లేకుండా ఎండిన కడుపుల్ని చూడు.. ఈ టెర్లిన్ పరదాలు చూడు.. నువ్వూ ఆడదానివే! ఆకలి అంటే వాళ్ళ ఆకలిని తీర్చుకొన్న కుక్కల్ని వదిలిపెట్టి మమ్మల్ని పట్టుకొన్నారే!" అని నవ్వినట్లుందా నవ్వు.

ఆ ఆడ మేజిస్ట్రేట్ గారు తలపైకెత్తి చూస్తే గదా?

వాళ్ళను చూడడమే మహాపాపం అన్నట్లుగా తలవంచుకొని 'ఒక్కొక్కరికి నూటయాభై రూపాయలు జరిమానా– కట్టలేకపోతే మూడు మాసాల కఠినశిక్ష!' అని ప్రకటించారు.

అప్పుడు ఆ తల్లి మనసు శాంతించినట్లుంది. హుందాగా పైకి లేచింది. వక్కీళ్ళు వంగుడు దండాలు పెట్టుతూంటే ఆమె దర్జాగా చేంబర్స్‌లోనికి నడిచింది. బహుశా అప్పుడు ఆకలి గుర్తుకు వచ్చిందేమో?

పోలీసులు పొంచిన కుక్కల్లా బోనులో ఉన్న ఆడవాళ్ళపైబడి బయటికి లాగారు.

నరసింహం కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

కోపం కూడా వచ్చింది.

తన చెల్లికో తల్లికో జరిగినట్లు ఆ పసిహృదయం తల్లడిల్లింది–'తన కులం మీద తనకే జాలిలేని ఆమె ఇచ్చే సర్టిఫికెట్!'– అడగడానికే మనస్కరించలేదు. అడుగుమీద అడుగ్గా ఆ కోర్టు ఆవరణ దాటాడు. ఆ కోర్టు ముందు... తాను చదువుకొన్న హైస్కూలు బిల్డింగ్స్ వెనుక–జ్ఞానానికీ అజ్ఞానానికీ మధ్య గీచిన నల్లటిగీత లాంటి తారురోడ్డు మీద నిలబడ్డాడు. నిలబడినంత సేపు ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఏమి చేయాలో తోచలేదు. ఎలా పోవాలో తెలియలేదు. ఏమి చేయడానికి తోచనపుడు.. ఎటు వెళ్ళాలో తెలియనపుడు ఏ పసిహృదయానికైనా గుర్తుకొచ్చేది ఇల్లే!.

ఆ ఇంటికే నడిచాడు నరసింహం.

నరసింహానికి తల్లి ఉంది. తండ్రి ఉన్నాడు!

తనబాధ తల్లితో చెప్తామంటే ఆమె నాలుగు గోడలకే పరిమితమైన మనిషి. పోనీ తండ్రితో చెప్పుకొందామంటే ఆయన ఆ నాలుగు గోడలమధ్య సాధారణంగా దొరకని మనిషి!

ఆ క్షణం వరకు నరసింహానికి ఈ సంగతి గుర్తుకు రాలేదు.

ఇంటిలో పెట్టింది తిన్నాడు. చదువుకోరా? అంటే శ్రద్ధగా చదువుకొన్నాడు. తెలివికి మంచి ప్రవర్తన జతచేశాడు. మంచి పేరు తెచ్చుకొన్నాడు. కానీ ఆ తెలివితేటలు కానీ మంచితనం కానీ ఇప్పుడు ఉప్పురాతికి కొరగా లేదు. 'మనం బడిలో నేర్చుకున్నదంతా మరిచిపోయిన తర్వాత మిగిలేదే అసలైన విద్య!' అని ఎవ్వరో అన్నట్టు లోకంలో ఆ విద్య నేర్చుకోవడం ఎలా అని ఆలోచిస్తూ ఇల్లు చేరాడు.

అదృష్టవశాత్తు ఆ సమయంలో తండ్రి ఇంట్లో ఉన్నాడు. అయితే కొడుకు ఇంట్లో అడుగు పెడ్తూ ఉంటే తండ్రి అడుగు బయటపెడ్తూ ఒకరికొకరు ఎదురుపడ్డారు.

కొడుకు మాడుమొగాన్ని తండ్రి చూశాడు.

తండ్రి మొగాన్ని చూడలేక తనయుడు తలవంచుకొన్నాడు.

ఆ మధ్యతరగతి కుటుంబంలో అది ఒక అపురూప సంఘటన!

"ఏంవిరా తండ్రీ! బర్తరఫ్ అయిన మంత్రి ముఖం పెట్టావే?" అని కొడుకు ఏడుపు మొగాన్ని చూసిన తండ్రి– తనయుణ్ణి అడిగాడు.

"తమవంటి తండ్రుల కడుపున పుట్టిన నేరానికి?"

అంతవరకు మింగిన చేదు అనుభవాన్ని కక్కాడు నరసింహం.

నరసింహం తండ్రి నాగభూషణం చెంప 'ఛెళ్ళు'మనిపించేవాడే కానీ అతడు రాజకీయవాది. కాండ్రించి మొకాన ఉమ్మినా... కాలికున్న దాన్ని చేతికి తీసుకొన్నా... కలత చెందకూడదు. కలవరపడకూడదు.' అన్న రాజకీయ నీతికి కట్టుబడినవాడు కాబట్టి క్షణం నిర్విణ్ణుడైనా మరుక్షణమే పకపకనవ్వుతూ–

"ఓరి బిడ్డా! చాలా పొరబాటు పడుతున్నావ్. నువ్వు పుట్టింది నా కడుపులో కాదు. మీయమ్మ కడుపులో. ఈ మాత్రం ఎరగనివాడివి మెడికల్ ఎంట్రన్స్‌లో పాసై డాక్టర్ కూడా కాబోతున్నావ్ కదరా?"

"వేళాకోళానికిది వేళగాదు నాన్నా"

"నాకు తెలుసు బిడ్డా! ఇది భోజనాల వేళ. ఆవేళకూడా దాటిపోతూ ఉంది. ఇంకా నువ్వు రాలేదని మీయమ్మ నిన్ను కడుపున మోసిన నేరానికి కలవరపడిపోతూ ఉంది. పో నాయనా! పో!"

అప్పుడు నాగభూషణం అర్ధాంగి రంగప్రవేశం చేసింది.

"అక్కడకి నిలపండి చాలు. ఎవరైనా వింటే నవ్వుతారు"

"సతీమణీ! అనవసరంగా నన్ను సాధించే ప్రయత్నాలు మానెయ్. నేనేవి మంత్రినా? నా మంత్రి పదవిని ఊడబెరకతానంటే నిన్ను వెళ్ళి ముఖ్యమంత్రి కాళ్ళమీద పడమన్నానా? ఎవరైనా వింటే నవ్వి పొయ్యేదానికి? ఈ సాధింపులు వేధింపులు వదిలిపెట్టి వచ్చేయ్... సరాసరి అసలు విషయనికొచ్చేయ్! బయట..."

"అఁ! బయట బారులు దీరి కార్లెదురు చూస్తా ఉండాయ్! ఆ కార్లల్లో ఉండేవాళ్ళ కాళ్ళోచేతులో పట్టేపనైనా చేతయ్యుంటే పొలుమారకుండా ఆ పనైనా చేసి ఆ రెండు సర్టిఫికెట్లు తీసిచ్చేదాన్ని!"

"సిగ్గు లేదూ నీకు?"

"సిగ్గు లేంది నాకు నాయనా! లక్షలకు లక్షలు డొనేషన్లు కట్టి మెడికల్ కాలేజీల్లో సీట్లు కొనుక్కుంటా ఉంటే కష్టపడి మెరిట్‌తో సీట్ తెచ్చుకున్నాను కదూ?! అందువల్ల నాకే సిగ్గు

లేదు. తెచ్చుకోకుండా ఉంటే ఈ సర్టిఫికెట్ల గొడవే ఉండేది కాదు. ఇప్పుడీ గొడవ గూడా ఉండేది కాదు.”

“పాపం! బిడ్డ. వారం దినాల్నుండి యాళకు తిండి తిప్పల్లేకుండా తిరగతా ఉండాడు. వాడు పడే యాతన చూస్తా ఉంటే కడుపు అట్నే తరక్కపోతా ఉండాది. అట్టజూస్తే ఇంటర్వ్యూకు వారం దినాలు కూడా లేవు”

ఆమె గొంతు అర్ద్రమయింది. అది గమనించిన నాగభూషణం పకపక నవ్వుతూ–

“ఈ డొంక తిరుగుడు వ్యవహారాల వల్లనే దేశంలో రాజకీయం భ్రష్టుపట్టిపోతా ఉంది. ఈ డొంకతిరుగుడు మూలాన్నే మనిషికి మనిషికీ మధ్య అవగాహన లోపిస్తూ ఉంది. ఇది కొంపల్లోకూడా ప్రాకడం దురదృష్టం. కాకపోతే మరేంది? అఫ్టరాల్ రెండు సర్టిఫికెట్లకా ఇంత రాద్ధాంతం! దీనికి కొండను తవ్వాలా? సిగ్గుచేటు. నిజంగా సిగ్గుచేటు! ఏం సర్టిఫికెట్లురా అవ్వి!”

“నేటివిటీ సర్టిఫికెట్ అండ్ కేస్ట్ సర్టిఫికెట్”

ఈసారి నాగభూషణం ఇల్లెగిరి పొయేటట్టుగా నవ్వుతూ–

“అర నిముషానికి అరవై ఆరు ఐడియాలిచ్చే అల్లుణ్ణి పక్కన్నే పెట్టుకొని అడ్వైజ్ కోసరం అమెరికాకు పొయ్యేమంత్రుల కథ మాదిరుండే నీ సంగతి! సరే కానీ పో! మన ఎమ్మెల్యే దగ్గరికి వెళ్ళి నేను పంపించినానని చెప్పు. తర్వాత ఏం జరిగిందో వచ్చి నాతో చెప్పు” అంటూనే చెప్పుల్లోకి కాళ్ళు దూర్చాడు నాగభూషణం.

ఆ ఆనందంతోనే కడుపు నిండిపోతే ఆదరాబాదరా కంచంలో కోడి కెలికుళ్ళు కెలికి నరసింహం ఎమ్మెల్యే కోసరం వెళ్ళాడు. అదృష్టవశాత్తు ఎమ్మెల్యే ఇంట్లోనే ఉన్నాడు.

వారం దినాలుగా నరసింహం పడిన తిప్పలు ఆ పూట ఒక కొలిక్కి వచ్చింది. నరసింహం “నేను నాగభూషణంగారి కొడుకును!” అన్నాడో లేదో ఎమ్మెల్యే ఎగిరిపడి లేచాడు. పక్కన కూర్చోబెట్టుకొన్నాడు. భుజం మీద చెయ్యివేశాడు. వేసిన చెయ్యి తియ్యకుండానే కాఫీ తాగించాడు. అప్పుడు ‘వచ్చిన పనేంవిటి?’ అని అడిగాడు.

నరసింహం గునుస్తూ గునుస్తూ చెప్పాడు. ఎమ్మెల్యే ఏకధాటిగా ఒక్క నవ్వు నవ్వేసి “ఒరే! పిచ్చోడా దీనికింత దూరం రావాలా! కాకితో కబురంపక పోతివా?” అన్నట్లుగా ఒక్క చూపు చూసి ‘రేపు తెల్లారే కాడికొచ్చి తీసుకొని పో నాయనా!’ అని చాలా మర్యాదగా చెప్పాడు.

నరసింహం గుమ్మయ్ పోయాడు.

తన తండ్రికి ఉండే పరపతి ముందు తలవంచినట్లుగా వంచిన తలెత్తకుండా ఇల్లు చేరాడు. ఎప్పుడు తెల్లారుతుందా? అని ఎదురుచూస్తున్నాడు.

తెల్లారింది!

ఆ తర్వాత పరుసగా మూడు రోజులు తెల్లారింది.

నాలుగోదినం తెల్లవారి నరసింహం తండ్రి ముందర తెల్లమొగం వేసి నిలబడుకొన్నాడు.

"ఏరా? సర్టిఫికెట్లు తెచ్చుకొన్నావా?"

"అс! అс! ఆ మండలాఫీసుచుట్టూ లేకుంటే ఆ కోర్టు చుట్టూ అదేపనిగా తిరిగి ఉంటే తప్పక తెచ్చుకొనేవాడిని. బుద్ధి గడ్డితినింది. తెల్లవారితో పోతే సాయంత్రం... సాయంత్రం పోతే తెల్లవారి...!"

ఒక్కక్షణం కనుబొమ ముడిచి... రెండవ క్షణంలోనే తలపంకించి ఆ తర్వాత పకపక నవ్వాడు నాగభూషణం.

"నా ఏడుపు నాదిగా ఉంటే ఏవిటా నవ్వు?" అన్నట్లుగా నరసింహం ఒక్కచూపు విసిరాడు. నాగభూషణం గ్రహించాడు.

"ఒరే బుజ్జినాన్నా! సర్టిఫికెట్లు ఇవ్వకూడదని కాదురా వాడు నిన్ను తిప్పించింది. అసలు రహస్యం తెలుసుకోకుండా ఆగ్రహిస్తే ఎలా? అసలు ఆ సర్టిఫికెట్లు ఎలా రాయాలో తెలియాలా? తెలిస్తేరాసేదానికి చదువుకోవాలా? అదేలేదు వాడికి. రాసేవాడు దొరికుంటే సంతకం పెట్టేదెంతసేపు? కొంచెం ఓపిక పట్టుబాబూ!"

నరసింహం నవ్వాలి. కానీ కనుబొమ ముడిపడింది.

కోపం తండ్రి మీద కాదు. చదువురాని ఎమ్మెల్యే మీద కాదు.

ఈ వ్యవస్థ మీద!

"హుс! ఈ వేలిముద్రల ఏలుబడిలో నేను చదువుకొన్నాను. ఇంకా చదువుకొంటాను. దీక్షగా చదువుకొంటాను. డాక్టర్ని కూడా అవుతాను. అప్పుడు నా చేతికొక్క అందమైన స్టెత్ కూడా వస్తుంది. దాంతో నేను ఒక్క రోగి రోగ నిర్ధారణ మాత్రమే చెయ్యగలను. కానీ ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్న రోగాన్ని??"

ఆ రోగాన్ని నయంచేయడానికి ఏస్టెత్ కావాలో? అర్థంకాకుండా అప్పటి నుండే ఆలోచనలో పడ్డాడు నరసింహం! ●

ఆంధ్రభూమి
(4, ఆగష్టు 1988)
జన్మదిన కథలపోటీలో ప్రథమ బహుమతి